# స్వీట్ సిక్స్‌టీన్

తాతినేని వెంకట నరసింహారావు



'స్వీట్ సిక్స్‌టీన్ సార్' రైల్వే వీక్ కాబోలు టూ టయర్ కండక్టరు అతి మర్యాదగా చెప్పాడు

అర్ధరాత్రి. నిద్ర ముంచుకొస్తోంది. చలి బాధ పెడుతోంది. ఇలాటి పరిస్థితుల్లో కిరీటికీ విట్టు నచ్చలేదు.

'మీ మొహం లాగుందండీ విట్టు' అనాలనిపించింది. కాని అన్లేకపోయాడు.

కిరీటి మర్యాదకోసం నవ్వు తెచ్చుకున్నాడు. అది నవ్వో లేక ఏడుపుకు నాందో అర్ధం చేసుకోవడం కష్టం.

'స్వీటో . హాటో . ఏదో ఒకటి సీటిచ్చారు. థాంక్స్' అన్నాడు కిరీటి బిజినెస్‌లైక్‌గా పదహారోనంబరు సీటుకోసం వెదకడం ప్రారంభించాడు. పెట్టంతా చిందర వందరగా వుంది, రావణాసురిడి పడగ్గదిలా. కొద్దిరోజుల్కితమే చదివిన సుందరాకాండ గుర్తు కొచ్చింది కిరీటికి

హనుమంతుడు రావణుని పడకగదిలో ప్రవేశించి ఆ దృశ్యాన్నిలా వర్ణించాడు.

'కొందరు వుత్తమాంగనలు పెట్టుకున్న ముత్యాలహారాలు చంద్ర కిరణాల వలె తేజరిల్లుతూ వారి స్థనాలమధ్య హంసలు పడుకున్నట్లుగా వుంది. కొందరి హేమసూత్రాలు వారి స్థనాలమధ్య చక్రవాక పక్షులవలె వున్నవి. అట్లా పడుకుని వున్న ఆ స్త్రీల జఘనాలు పెద్ద పెద్ద పెద్ద యిసుక తిన్నెలవలెనూ, వారి దేహ కాంతులు గట్లవలెనూ, వారు శోభాయమానమైన నదులవలెనూ కనిపించారు. కొందరు స్త్రీలు తమకు దగ్గరలోవున్న వారి రొమ్ములమీద తలపెట్టుకొని నిద్రిస్తున్నారు. అక్కడ నిద్రపోతున్న స్త్రీలు పెట్టుకున్న ఆభరణాలు కానీ, వారు వేసుకున్న పూలదండలు కానీ, వారు కట్టుకున్న చీరలుగానీ అన్నిటికీ మించి వారి అవయవాలుగానీ 'యివి వీరివి' అని నిర్ణయించడము అశక్యము'

ఇంత శృంగారం చూసి కూడా హనుమంతుడు బ్రహ్మచర్యం ఎలా నిలబెట్టుకోగలిగాడా అని కిరీటి అనుమానం.

మొత్తంమీద పదహారో నెంబరు సీటు దొరికింది కిరీటికి. చేతిసంచి మెల్లగా క్రిందబెట్టి కూర్చునే లోగా కిరీటికి వొళ్లు మండింది. తనప్రక్క మూడు సీట్లనూ సొంతం చేసుకుని ఒక వ్యక్తి

హాయిగా నిద్రపోతున్నాడు. పడుకుంటే పడుకున్నాడు 'ఆ దర్జా ఏమిటి? బోడి దర్జా' అనుకున్నాడు కిరీటి. లేపి సున్నితంగా 'ఏంబాబూ! ఈ రైలు మీతాత వేయించాడా?' అందామనుకున్నాడు. ఒకవేళ తెలుగువాడు కాకపోతే?

'ఈజ్ దిస్ యువర్ గ్రాండ్‌ఫాదర్స్ డబ్బ' అనొచ్చు కిరీటి యింగ్లీషులో కొంచెం పూర్ లెండి

ముసుగుతన్ని నిదిస్తున్న వ్యక్తి బద్ధకంగా వొళ్ళు విరుచుకుని మూల్గడం వినిపించింది.

కిరీటి క్షణంసేపు పస్తాయించి విన్నాడు

పురుష కంఠంలా లేదు కోకిల స్వరంలా, మృదువుగా, మధురంగా వినిపించింది. ముసుగులోనుంచి చెయ్యి కొద్దిగా బైటపడింది తమలపాకులాటి చేతికి — ఒకే ఒక్క బంగారుగాజు — నాజూగ్గా వుంది

'అర్జునా! ఫల్గుణా! కిరీటీ' అనుకున్నాడు కిరీటి.

'ఇంకొంచెం వుంటే అఘాయిత్యం చేద్దునే? జబ్బపట్టుకుని కూర్చోపెట్టి వుందును' అనుకున్నాడు.

'ఇప్పుడేమిటి కర్తవ్యం? కూర్చోవడమే?' కిరీటి ఆలోచనలో పడ్డాడు. ముక్కూ, ముఖం తెలీని పూబోడి ప్రక్కన అర్ధరాత్రి సమయంలో — రైల్లోనే అనుకో — అందులో నిద్ర ముంచుకొస్తున్న సమయంలో ఏమంత శ్రేయస్కరం?'

'టుబీ—ఆర్ నాట్ టుబీ' హేమ్లెట్ డైలమాలో పడ్డాడు కిరీటి.

అసలు పదహారో నెంబరు కిరీటికెప్పుడూ అశుభమే.

కిరీటి ప్రణయంలో మొట్టమొదటి అనుభవం పదహారో యేట జరిగింది

'సక్కూ! వందరూపాయల చెక్కూ' అన్నాడు. సక్కుబాయి సన్నగా వెళ్ళి హెడ్మాష్టరుకి రిపోర్టివ్వడం.. నానా రభసా జరగడం — క్షమాపణ చెప్పకోడం. కిరీటికి గుర్తొచ్చినవి. ఆసర్వులో కిరీటి నంబరు పదహారు అందుకే పరీక్ష చెట్టెక్కిందని కిరీటి నమ్మకం. ఇలా చెప్పుకుపోతే లెక్కలేనన్ని ఏకరువు పెట్టగలడు కిరీటి.

అందుకే పదహారో నెంబరంటే చచ్చే భయం కిరీటికి

'అలా నిలబడిపోయారేం సార్?' కండక్టరు నవ్వుతూ పలుకరించడంతో కిరీటి డైలమానుండి బైటపడ్డాడు.

'అలా అర్థం పర్థం లేకుండా అలా నవ్వుతాడేమిటి ముండావాడు' కిరీటి మనసులో అనుకున్నాడు.

'వన్‌మే స్మయిల్ అండ్ స్మయిల్ అండ్‌బియె విలన్' హేమ్లెట్ మాటలు గుర్తొచ్చినవి.

'రైల్లో మొగమోటపడితే లాభంలేదు సుమండీ?' కండక్టరు హెచ్చరించాడు. ఆ హెచ్చరింపు కిరీటికి ఎత్తిపొడుపులా వుంది.

'అలా దేభ్యంలా నిలబడి పొయ్యావేమయ్యా? కూచోక?' అనలేక మర్యాదగా పైమాటలు వడ్డించినట్లుంది కిరీటికి.

కిరీటి పదహారోనంబరు సీటులో కొంచెం వొత్తిగిలి కూర్చున్నాడు. స్వతహాగా కిరీటి. మొహమోటస్తుడు.

'ఇంకానయం' అనుకున్నాడు కిరీటి ఆవిడ తనవైపు తలపెట్టుకుని పడుకుంది. కాళ్ళు తనవైపునున్నా చచ్చినట్లు తను కూర్చోవలసిందే నిద్రమత్తులో ఆవిడ సాచి తన్నినా భరించి వూరుకోవలసిందే ప్రస్తుతానికి ఆ ప్రమాదం తప్పినందుకు కిరిటీ కొంచెం సంతోషించాడు

చీకట్లను చీల్చుకుంటూ రైలు దూసుకు పోతోంది. కిరీటికి నిద్రమత్తు వొదిలిపోయింది. కిరీటి ఆలోచన ప్రేమ వ్యవహారాల్లోకి మళ్ళింది.

'ప్రేమ వ్యవహారాల్లో కిరీటి వొట్టి వాజెమ్మ' ఇది మిత్రబృందం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం. అలాగని వూరుకోరు

'బెండకాయలు ముదరకూడదు
బ్రహ్మచారులు ముదరకూడదు;
ఒంటరితనం అడవిలోపల
యవ్వనం వెన్నెలలా వేష్టుకాకూడదు.'

అరుద్రపద్యం బిగ్గరగా కిరీటికి వినిపించేలా పాడతారు. ప్రతి అంట్ల వెధవకీ తన గొడవే. ప్రతివాడికీ తమ లోకువే! తనకు ముప్ఫైయేళ్ళు దాటి వుండొచ్చు. వేరే కారణాలవల్ల ఇంతవరకూ కళ్యాణ ఘడియ తొంగిచూడక పోవచ్చు. అంతమాత్రాన యింత దద్దమ్మను చెయ్యడం కిరీటికి గొప్ప అవమానంగా వుంటోంది. ఒక్కొక్కప్పుడు తల తీసేసినట్లుంటుంది. తలను నేలకేసి బాదుకోవాలనిపిస్తుంటుంది వీళ్ళందర్నీ సాదరంగా భోజనానికి పిలిచి సాచి లెంపకాయ కొట్టాలనిపిస్తుంది. అప్పుడప్పుడూ కిరీటి తర్కించుకుంటాడు

'అవును! పెళ్ళికాకపోతే పోయె. కనీసం తానొక్క లౌవ్ ఎఫైర్‌కీ నోచుకోలేదా? ఖర్మం కాకపోతే!' వాపోతుంటాడు.

'హైస్కూల్లో, కాలేజిలో తరువాత జీవితంలో ఒక్క ఆడదీ తనకు తటస్థపడలేదు. సినిమాల్లో చూపించే ప్రేమ సీన్లు, కథల్లో రకరకాల రాతలూ అంతా వొట్టిది. ప్రేమించడమంటే మజాకా కాదు.' అని వుసూరుమంటాడు.

'ఏరీ? ఆడవాళ్ళు? ఒక్కరూ కనిపించరే?' అని విసుక్కుంటాడు.

బిట్రగుంట దాటిపోయింది. పెట్టెలో అంతా హాయిగా నిద్రపోతున్నారు. అక్కడక్కడా బ్రహ్మాండమయిన గురకలు వినిపిస్తున్నవి

'అదృష్టవంతులు' అనుకున్నాడు కిరీటి

'వాళ్ళెవరో టిక్కెట్టు లేనివాళ్ళయినా అయుండాలి లేకుంటే అందినకాడికి అప్పుచేసి అయిపెట్టిన వాళ్ళయినా అయుండాలి'

తీర్మానించాడు కిరీటి

కిరీటి ప్రతి విషయాన్నీ పరిశీలనగా చూస్తాడు.

ప్రక్కన (ప్రక్కసీట్లలో) పడుకున్న లలనామణిని చూడాలనిపించింది కిరీటికి. లైటు మసగ్గా వుంది. ముఖం సరిగ్గా కనిపించడం లేదు. మొత్తానికి నాజూగ్గా అందమైన అమ్మాయిని వూహించుకున్నాడు.

పడుకున్న పడుచు 'ఊ' అంటూ దీర్ఘంగా మూలిగి ముసుగుదీసుకు పడుకుంది.

'ఏ బాషలో మూల్గింది చెప్మా' అనుకున్నాడు కిరీటి

'ఏడుపుకీ, నవ్వుకూ, మూల్గుకూ భాషేమిటి నా బొంద. భగవంతుడి భాష' సర్ది చెప్పుకున్నాడు.

ఆ సుందరి సైకాలజీ ఎనలైజ్ చేయ

డాని కువిక్రమించాడు. ఈ మధ్య సైన్సు పత్రికొకటి చదివాడు కిరీటి. నిద్రిస్తున్న తీరునిబట్టి మనిషి మనస్తత్వం చెప్పడం.

ఆమె అతి సుకుమారంగా ముడుచుకుని పడుకుంది. కాబట్టి ఆత్మవిశ్వాసం లేని మనిషయి వుండాలి. మనిషి పుట్టకముందు తల్లిగర్భంలో యిలాగే ముడుచుకుని వుంటాడు. అంటే చీకూ చింతా లేకుండా, బరువు బాధ్యతలు లేకుండా, హాయిగా, పసిపాపలా వుండాలనుకునే తత్వం. ఇలాటి వ్యక్తికి బలమైన—అంటే కాయ బలంకాదు–వ్యక్తిత్వబలంకల లైఫ్ పార్ట్నర్ కావాలి. ఈ వ్యక్తి ఎప్పుడూ నాయకుణ్ణి అనుసరిస్తుండేగాని నాయకత్వం వహించదు.'

కిరీటికి ఆ యువతిపైన విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది. జాలే క్షణంలో గౌరవంగా మారింది.

'అసలు పెళ్ళయే యోగమే వుంటే యిలాటి లక్షణాలున్న పడుచుతోనే కావాలి!' అనుకున్నాడు కిరీటి. ఇంతగా లతలా పెనవేసుకుపోయే భార్యను పొందిన భర్త అదృష్టం దేనితో కొలవడం?

ఆసలీమధ్య కార్టూనిస్టులకొక అంటురోగం పట్టుకుంది. ఎంతసేపూ

# స్వీట్ సిక్స్టీన్

మొగుణ్ణి ఒక్క వాజమ్మలా చిత్రించే బొమ్మలూ, భర్తతో వంట చేయించే చిత్రాలూ — యిలాటివి. ఈ ధోరణి ఇంగ్లీషు పత్రికల్నుండి మనకు సంక్రమించింది. ఇంగ్లీషువాళ్ళలో హెన్ పెక్డు హస్బెండ్స్ ఎక్కువని ఎక్కడో చదివాడు కిరీటి అందుకని వాళ్ళ కార్టూన్లలో ఆ ధోరణెక్కువ. మన వాళ్ళు వాటిని కాపీ కొడుతున్నారు.

అలాటి కార్టూన్లు చూసినప్పుడల్లా కిరీటి వొళ్ళు మండుతుంది. ఈ అన్యాయపు ధోరణికి కిరీటి అడపాదడపా సంపాదకులకు ఘాటుగా వుత్తరాలు వ్రాయడం కూడా కద్దు.

రైలు రొద పెట్టుకుంటూ పోతోంది. చక్రాలు లయ తప్పకుండా ధ్వని చేస్తున్నవి.

అతివచెయ్యి కిరీటికి ఆరంగుళం దూరానికి జరిగింది.

కిరీటి జాగ్రత్తగా పరిశీలించి చూశాడు.

'అది బఫర్‌జోన్... కాదు నోమాన్స్ లాండ్' అనుకున్నాడు కిరీటి.

'అతిక్రమణలు ప్రమాదానికి దారి తీయొచ్చు. అందుకె వుభయుల మధ్యా వొప్పందం కుదరాలి. కాని ఆవిడది ఏక పక్ష నిర్ణయం. చైనా వాడిలాగా 'లైన్ ఆఫ్ యాక్చ్యుయల్ కంట్రోల్' అంటూ మన భూభాగంమీద విరుచుకు పడితే ?'

'ఛ...ఛ...' అనుకున్నాడు కిరీటి. ఈ అమ్మాయిని చైనావాడితో పోల్చడం అన్యాయం అనిపించింది. అసలు చైనాలో యిలాటి అమ్మాయిలుంటారా? ఇదివరలో వుండేవారుట. కాని మావో ప్రభుత్వంలో అమ్మాయిలుకూడా అబ్బాయిల్లాగే వుంటారుట.

అనుకున్నంతా అయింది. చైనా దురాక్రమణ జరిపింది.

ఆమెచెయ్యి కిరీటి తొడమీద విసురుగా పడింది

'పోనీ పొరపాటున పడిందంటి! తీసెయ్యొచ్చుగా ?' అనుకున్నాడు కిరీటి.


'అబ్బె! ఎందుకు తీస్తుంది? స్వాతంత్ర్యం నా జన్మహక్కు అన్నట్లుగా ఖడేరావులాగ అలాగే వుండిపోతోందే? ఏవిటిగతి ?' కిరీటికి గొప్ప పరీక్షా సమయం అనిపించింది. ఎవరైనా చూస్తే? కిరీటి మెదడు బ్రహ్మాండమైన చురుగ్గా పనిచేసింది. జేబుగుడ్డ వొత్తుపెట్టుకుని (స్త్రీ శరీరం తాకకుండావుండే నిమిత్తం) మెల్లగా ఆమె చెయ్యితీసి ప్రక్కన వుంచాడు.

న్యూటన్ మూడవ సిద్ధాంతం గుర్తు చేస్తున్నట్లు రపీమని ఆమె చెయ్యి స్వస్థానం చేరుకుంది. కిరీటి శరీరం జలదరించింది. విద్యుత్తు ప్రవహిస్తున్నట్లుగా వుంది. ముచ్చెమటలు పోస్తున్నవి.

'ఏమిటి చెప్మా కర్తవ్యం ?' అనుకున్నాడు తియ్యటిబాధ నరం యింజక్షను లాగా కిరీటి దేహమంతా ప్రాకిపోయింది.

ఆ యువతి అతిగారాబంగా మూలిగి కిరీటి చెయ్యి పట్టుకుని తనవైపు లాక్కుంది. కిరీటి బుర్ర పనిచెయ్యడం మానేసింది. తల మరోవైపుకు త్రిప్పి భగవంతుడిమీద భారం వేశాడు. పాపం! కిరీటి మొహమాటస్తుడు.

చెయ్యి మెల్లగా ప్రయాణం చేసింది. చేసి...చేసి...ఆమె కప్పుకున్న రగ్గులో ప్రవేశించిందని కిరీటికి నిజంగా తెలి



యడు. నిమ్నోన్నతాల్ని సర్వే చేస్తున్న సంగతి కిరీటికి తరువాత తెలిసింది.

ఎక్కడో గంధర్వలోకంలో విహరిస్తున్నట్లుగావుంది కిరీటికి

శరీరం గాలిలో తేలిపోతున్నట్లనిపించింది.

కాలం స్తంభించి పోయింది.

'ఏయ్ ? ఏయ్ ?' అంటూ పై బెరు మీద పడుకున్న మరో యువతి ఒక్క దూకు దూకింది.

కిరీటి చటుక్కున్న చెయ్యి లాక్కున్నాడు

పడుకున్న యువతి వులిక్కిపడి లేచి కూర్చుంది

'ఏమిటే ఆ కంగారూ ?' బద్ధకంగా అంది ఇంగ్లీషులో.

'ఏమిటే ? అనడానికి ఇంగ్లీషులో ఏమంటారు' అని అడగొద్దు.

'వీడు...వీడు...రాస్కెల్...డర్టీస్వయిన్...' దూకినమ్మాయి వుద్రేకంతో చెప్పుతూ వాక్యం పూర్తిచెయ్యలేక పోయింది.

'ఏమిటి నీ ఆయాసం ?'

'నీ మీద చెయ్యివేశాడే'

'పోనిస్తూ నిద్ర మత్తులో ఏదో జరిగుంటుంది.'

కిరీటికి తెలివొచ్చింది,


'మహాతల్లి రక్షించావు. ఆపదనుండి కాపాడి నా పరువు దక్కించావు' కిరీటి మనసులో కృతజ్ఞత చెప్పుకున్నాడు.

'వెరీ సోరీ మిస్టర్' క్షమాపణ చెప్పుకుంది కోకిల. కిరీటికిది రెండో షాక్. ఇంకా మొదటి షాక్‌నుండి పూర్తిగా కోలుకోనేలేదు.

'హబ్బె!...ఫరవాలేదు... ఫరవాలేదు...' అనేశాడు అచ్చ తెలుగులో. తరువాత తట్టింది 'నెవర్‌మైండ్' అనన్నా ఇంగ్లీషులో అనలేకపోయానే అని.

'అదేమిటే ? మధ్యన నువ్వు సోరీ అంటావు. అఘాయిత్యం చేసింది వాడు. బుద్ధి చెప్పడంపోయి ఈ బెంబే లేమిటి?' దూకుడమ్మాయి దూకుడుగా

'ఇందులో అతని తప్పు పాలెంతో నేను నిర్ణయించలేను. నా వొంతు మాత్రం ఎక్కువే. మాంచి భయంకరమైన కల్లో వున్నాను. సముద్రంలో ఎక్కడికో వెడు



# ఆంధ్రసచిత్రవారపత్రిక

## 1969 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించబోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము. రచయితలందరూ ఎప్పటివలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

## మొదటి బహుమతి రు. 2300

## రెండవ బహుమతి రు. 1600

## మూడవ బహుమతి రు. 550

### నిబంధనలు

1. కథలు ఇంతకుముందు ఎక్కడా అచ్చుకాని స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత తన స్వంత రచనేనని, దేనికీ అనువాదం కానీ, అనుసరణ కానీ కాదని హామీ రాసి పంపాలి. ఈ హామీలు వేరే కాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2. కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి.

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒకవైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయిత పేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సైజు నోట్ బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు.

4. కవరు మీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి. పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టి స్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేదీ 30—8—69 ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 7—11—69 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే. ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8. వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్ళలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంప నవసరం లేదు.

9. పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.


# స్వీట్ సిక్స్టీన్

తున్నాను. ఓడ పెనుతుఫానులో చిక్కుకుంది. వుయ్యాలలా వూగిపోతోంది. గట్టిగా యితని చెయ్యి పట్టుకున్నాను గాబోలు. ఎలా ఈ విధంగా జరిగిందో వివరించలేను' అంది. కిరీటి పూర్తిగా కుదుటపడ్డాడు.

'ఒరే కిరీటీ ?.. ఆడపిల్ల ... అంత చక్కగా, విశ్వచ్ఛిగా జరిగిన పొరపాటు చెబుతోంటే నీవేమీ ఎరగనట్టు ఏమిటా వెధవ ముఖం. నవ్వూ?' అని ఎవరో నిందిస్తున్నట్లనిపించింది కిరీటికి. ధైర్యం తెచ్చుకున్నాడు.

'ఏదో లెండి! యిందులో నా పొరపాటు కూడా కొంత లేకపోలేదు' అన్నాడు కిరీటి తెగించి.

'నెవర్ మైండ్ మిష్టర్' అందా యువతి చిలిపిగా నవ్వుతూ.

దూకుడమ్మాయి మాత్రం కిరీటివంక కొరకొరా చూస్తూనే వుంది.

కిరీటికి మాప్ ఫోకటి గుర్తుకొచ్చింది. ఒకణ్నో ఒక యువతి గాఢంగా ప్రేమిస్తుంది. కారణాంతరాలవల్ల ప్రియుడు మరో దేశంలో కొన్నాళ్ళు గడపాల్సొచ్చింది. రోజూ ప్రియుడి దగ్గరనుండి వుత్తరం కోసం ఎదురు చూడటం అలవాటయింది. రానురాను ప్రియుడి వుత్తరంకన్నా పోస్ట్ మాన్ రాకకోసం ఎదురు చూడటం ఎక్కువయింది. చివరికి పోస్ట్‌మాన్‌ని పెళ్ళాడేసింది.

కిరీటి ఈ కథని తనకి అన్వయించుకున్నాడు. ఆమె కలలో తన చేతిని ఆదరాగా తీసుకుంది. జీవితంలో కూడా తీసుకుంటే?

విజయవాడ స్టేషన్లో బండి ఆగింది. కిరీటి దిగిపోవాలి. మనసు చివుక్కుమంది.

'మీరెందాకా వెడతారు ?' అడిగాడు ధైర్యంచేసి.

'కలకత్తా' అందామె నవ్వుతూ. తిరిగి ఆమే —

'మీరు దిగిపోతున్నారా ?' అడిగింది. నిరుత్సాహం కొట్టొచ్చినట్టుగా కనబడింది కిరీటికి!

'తప్పదు!'

'ఛీర్ యూ!'

కిరీటి దిగులుగా దిగిపోయాడు ■